క్లుప్తంగా

ఘనంగా ఉమరామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠాపనోత్సవం



స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మంగువారితోట రామ్‌నగర్‌లో రామమందిరం వద్ద ఉమా రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానాచార్యులు పెంట శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాలలో భాగంగా చివరి రోజు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



పొలంలో విత్తనాలు జల్లుతున్న రైతులు, అధికారులు

ఎచ్చెర్ల: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని రీజనల్ ఆఫీసర్ హేమసుందర్, డీపీఎం పూజారి సత్యనారాయణ, ఏడీపీఎం ధనుంజయరావు అన్నారు. గురువారం తమ్మినాయుడుపేటలో వ్యవసాయ, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ నమూనాలు, ఏటీఎం మోడల్, ఏ–గ్రేడ్ మోడల్, పీఎండీఎస్, ఆర్‌డీఎస్ మోడల్స్‌ను పరిశీలించి సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న అవినాష్

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అరసవల్లిలోని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఎం.జగ్గు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం



పాఠశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

జి.సిగడాం : విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. గురువారం జి.సిగడాంలో అక్షర ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, పాఠశాల యాజమాన్యం టి.బలరాం, పి.తేజశ్రీ, సీహెచ్ హరిశంకర్ ప్రకాశ్, బి.గౌరీప్రసాద్, ఎం.త్రినాథ్, కూటమి నాయకులు రవికుమార్, వెంకటరమణ, భూపతి అర్జున్‌కుమార్, పట్నాన పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

రణస్థలం: రణస్థలం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 24న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ఎచ్చెర్ల: ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. గురువారం లావేరు శాఖా గ్రంథాలయం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయాలు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, ఏపీవో సత్యవతి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నవ వధువు అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని గాజులవీధిలో ఇటీవల వివాహమైన ఓ నవ వధువు అదృశ్యమైనట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. స్నేహితుల వద్దకు వెళ్తానని చెప్పి తిరిగి రాలేదని తండ్రి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

ఫ్యామిలీ డాక్టర్.. సేవలకు సెలవు!

- పేదల ఇంటికే వెళ్లి వైద్యం అందించే పథకాన్ని నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం
- మంచానికే పరిమితమైన రోగులకు తప్పని ఇబ్బందులు
- ప్రజా వైద్యాన్ని గాలికొదిలేయడంపై మండిపాటు





జి.సిగడాం మండలం సీతంపేటలో ఇంటి వద్ద సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

రణస్థలం/ఎచ్చెర్ల/జి.సిగడాం: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా.. ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకేసి ప్రజల వద్దకు వైద్యసిబ్బంది వెళ్లి సేవలందించేలా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎంతోమంది నిరుపేదలు ఇంటి వద్దనే అత్యుత్తమ వైద్యసేవలు పొందారు. ముఖ్యంగా మంచానికే పరిమితమైన ఎంతోమంది వృద్ధులు ప్రతి నెలా చక్కటి వైద్యసేవలు అందుకుని కోలుకున్నారు. ఇంతటి మహత్తరమైన పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లుపొడిచింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఇతర సంక్షేమ పథకాల మాదిరిగానే ఈ పథకాన్ని కూడా నిర్వీర్యం చేసింది. పేదలకు ఇంటి వద్ద వైద్యం పొందకుండా చేసింది.

జగనన్న సురక్షదీ అదే దారి..

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గత ప్రభుత్వ హయాంలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించారు. నిపుణులైన వైద్యులచే 14 రకాల వైద్య సేవలను గ్రామాల్లోనే శిబిరాలు పెట్టి మరీ దించారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అక్కడికక్కడే మందులు అందజేశారు. అనారోగ్యం తీవ్రంగా ఉంటే ఆ వైద్యులే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స నిమిత్తం సామాజిక, సర్వజనాసుపత్రులకు రిఫర్ చేసి చికిత్స అందించేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి.



ఎచ్చెర్ల మండలంలో ఇంటింటా వైద్యసేవలను అందిస్తున్న ఫ్యామిలీ వైద్యులు (ఫైల్)

అప్పులపాలవుతున్న జనం..

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జ్వరం వస్తే ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తూ కష్టార్జితమంతా ధారబోస్తున్నారు. కొన్ని వైద్యసేవలకు ఆరోగ్యశ్రీ ఉన్నా అత్యవసరంగా వైద్యం చేయాలని ప్రయివేటు ఆసుపత్రులు తొందర పెట్టడంతో వేలాది రూపాయలు అప్పులు చేసి చికిత్స చేయించుకుంటున్నారు. గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేది. ఆరోగ్యశ్రీలో లేని వాటికి సీఎం రిలీఫ్ అందజేసి ఆదుకున్నారు. చిన్న పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకలు వంటి వివిధ రోగాలకు సంబంధించి కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు..

ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మరోవైపు చాపకింద నీరులా కరోనా కేసులు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. వీటితో పాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, వంటి వ్యాధులు సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మందుల కోసం పాట్లు



గత ప్రభుత్వ హయాంలో మందులన్నీ మా ఇంటికే వచ్చి ఇచ్చేవారు. వైద్య సిబ్బంది ప్రతి వారం ఇంటికి వచ్చి తనిఖీలు చేసి మందులను అందించేవారు. ఇప్పుడు అరకొరగానే మందులు ఇస్తున్నారు. మిగతా మందుల కోసం ఇబ్బందులు తప్పడం లేదు. – ఎస్.అప్పలనరసమ్మ, సీతంపేట, జి.సిగడాం మండలం

అందని సేవలు..



మంచంపై ఉన్న రోగులకు గతంలో సక్రమంగా వైద్య సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో వైద్యసేవలు అందించడంలేదు. జగనన్న హయాంలో ఇంటింటికి వచ్చి రోగుల కోసం సర్వే చేసి మందులను అందించేవారు.

– బి.లక్ష్మి, సీతంపేట, జి.సిగడాం మండలం

వృద్ధులకు ఇబ్బంది



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులకు ఫ్యామిలీ డాక్టర్ పథకం ఉపయోగకరంగా ఉండేది. ఇంటివద్దకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసేవారు. తరచూ వచ్చి యోగక్షేమాలను తెలుసుకునేవారు. ఇప్పుడా వ్యవస్థ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

– దాలినాయుడు, గొల్లపేట, ఎచ్చెర్ల మండలం

ఇంటికి వచ్చేవారు



జగనన్న ప్రభుత్వం హయాంలో పెద్ద పెద్ద వైద్యులు ఇంటికే వచ్చి రోగులకు వైద్యసేవలను అందించేవారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. – విక్రం కోటిబాబు, మఠ్రివలస, జి.సిగడాం మండలం

పేదలకు ఇబ్బందులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేశారు. పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడేవి. ఇప్పుడు వైద్య శిబిరాలు లేకపోవడంతో సీజనల్ వ్యాధులతో పాటు కరోనా భయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– గురాన తిరుమల మానస, వల్లభరావుపేట, రణస్థలం

చిత్తశుద్ధి లేదు



గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వంటివి ప్రబలితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. అందుకే ఎక్కడా వైద్య శిబిరాలు, ముందస్తు కరోనా పరీక్షలు వంటివి చేపట్టడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి.

– అల్లిపల్లి సత్తిరాజు, కొవ్వాడ, రణస్థలం మండలం

బోరు కప్పేసి.. పునాది కట్టేసి..



బోరుపై పునాది కట్టిన దృశ్యం

రణస్థలం: యర్రవరం పంచాయతీ చినయామలపేటలో ప్రభుత్వం ఏర్పాటు చేయించిన చేతి పంపు(బోరు)ను అదే గ్రామానికి చెందిన కలివరపు లచ్చుము అనే వ్యక్తి మట్టితో కప్పేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిపై గ్రామస్తులు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావుకు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఈ నెల 2న ఫిర్యాదు చేశారు. అయిన అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రేవతి వద్ద ప్రస్తావించగా సమస్య తన దృష్టికి రాలేదని, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి చర్యలు చేపడతామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ స్పందిస్తూ బోరు తొలగించిన ప్రదేశాన్ని పరిశీలించి తగు చర్యలు చేపడతామని చెప్పారు.

కేశవరావుపేట విద్యార్థి ప్రతిభ



అవార్డు అందుకుంటున్న శశిధర్

ఎచ్చెర్ల: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణా మండలి, శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో కేశవరావుపేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న రాజీవ్ కాలనీకు చెందిన 5వ తరగతి విద్యార్థి గరుగు శశిధర్ ప్రథమ స్థానం సాధించాడు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతులమీదుగా బహుమతి అందుకున్నాడు.

ప్లాస్టిక్‌ను నియంత్రించాలి



మాట్లాడుతున్న నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : వృక్షాలే పర్యావరణానికి మూలస్తంభాలని, వాటిని నాశనం చేస్తే భావితరాలకు ముప్పు తప్పదని నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ సేవా సదన్‌లో సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.శాంతిశ్రీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎంఈఈ కరుణశ్రీ, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తి, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుధాకర్, టి.శివప్రసాద్, బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.దామోదరరావు, అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

నైరా కళాశాలలో పర్యావరణ దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలేజీ ఆవరణలో కొబ్బరిమొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జోగినాయుడు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అనంతరం వ్యాసరచన, డిబేట్, పెయింటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌పి డాక్టర్ గోవిందరావు, పి.గురుమూర్తి, ఉపేంద్ర, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన



స్కిట్ ప్రదర్శిస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'పచ్చని చెట్టును నేను–ప్రాణవాయు పట్టుని నేను' అంటూ విద్యార్థులు చక్కటి స్కిట్‌ను ప్రదర్శించారు. బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో బాల కథానిలయం అధ్యక్షుడు బోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ సంచులు విడనాడాలని, గుడ్డ సంచులనే వాడాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.

వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభం



చిన్నబజారులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



బ్యాంకర్స్‌కాలనీలోని శివబాలాజీ ఆలయంలో..

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలోఅర్చకులు రేజేటి వేంకట శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, ధ్వజారోహణం, మహానివేదన, నీరాజనం, మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ జరిగింది. శుక్రవారం జ్యేష్ఠశుద్ధ ఏకాదశి సందర్భంగా స్వామివారి కల్యాణ వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మాధవి, గీతా సత్సంగం భక్తులు పాల్గొన్నారు. బ్యాంకర్స్‌కాలనీలోని శివబాలాజీ ఆలయంలో అర్చకులు గోపినంబాళ్ల సీతారామాచార్యులు, ఆలయ కమిటీ సభ్యుల నేతృత్వంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హోమాలు, విశ్వక్సేనారాధన , మండపారాధనలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తులసీరావు, సామంత్, శర్మ, భక్తులు పాల్గొన్నారు.



ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజారోహణ

గుడివీధి ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఈశ్వరుని వాహనమైన నందీశ్వరుని జెండాను అవరోహణ చేసి పూజలు చేశారు. శుక్రవారం శివపార్వతుల కల్యాణం, స్వామివారిని సర్పవాహనంపై ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శ్రీకాకుళం రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న నైరా కళాశాల విద్యార్థులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్‌ఎం ఫణికుమార్, చైర్మన్ జి.సువర్ణ రాజు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.శాంతిశ్రీ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, కార్యదర్శి పిట్టా దామోదరరావు, బీసీ న్యాయవాదులు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. పాత్రునివలస ఫ్లైఓవర్ మీదుగా ర్యాలీ నిర్వహించి చెరువు గట్టు, పెదపాడు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. అనంతరం అటవీశాఖ ఏర్పాటు చేసిన ఛాయచిత్ర ప్రదర్శన తిలకించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కరుణ, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, మహిళా శిశుసంక్షేమాధికారి శాంతిశ్రీ, జిల్లా అటవీశాఖాధికారి ఎస్.వెంకటేష్, ఆర్‌డీఓ సాయి ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం అర్బన్: ప్రకృతిని పరిరక్షించేందుకు ఒక్క రోజులోనే పెద్ద హరిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టర్ నివాసం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, డీసీ బాడాన దేవభూషణరావు, నూతన అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, కార్యదర్శి టిక్కం రాంగోపాల్, కోశాధికారి బి.కృష్ణ చైతన్య పాల్గొన్నారు.
- ఎచ్చెర్ల: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామ్మోహనరావు, ఏపీవో శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.
- రణస్థలం: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ప్రసాద్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.
- జి.సిగడాం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, వైద్యులు డాక్టర్ యశ్వంత్, సుమబిందు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ మొక్కలు నాటారు.
- శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆసుపత్రి బొల్లినేని మెడిస్కిల్స్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీపద్మజ, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ లలిత, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమంత్, సెంట్రల్ హెడ్ బీహెచ్ఎస్ ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయం ఆవరణలో ప్రాజెక్ట్ అధికారి జి.శోభారాణి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కృష్ణాపార్కు సెక్టార్ పర్యవేక్షకులు పి.సీతామహాలక్ష్మి, కె.ఉమ, పి.యశోద, కె.కల్యాణి, బి.యోగేశ్వరి, గజలక్ష్మి పాల్గొన్నారు.
- రణస్థలం: పాతర్లపల్లి గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ భూసార విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కుమార్ అభిషేక్, టెక్నికల్ అసోసియేట్ ఫార్మా మెకానైజేషన్ పార్థ రాజేంద్ర సింగ్ పవర్, ఆగ్రో ఏరియా మేనేజర్ నరసింహమూర్తి, పి.తవిటినాయుడు, ఎస్సీ నారాయణరావు, అనిల్, శ్రావణి పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: జెమ్స్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



శ్రీకాకుళం పాతబస్టాండ్: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



శ్రీకాకుళం అర్బన్: కలెక్టర్ నివాసం వద్ద మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



ఎచ్చెర్ల: ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీపీ చిరంజీవి



రణస్థలం: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు



శ్రీకాకుళం రూరల్: జాతీయ రహదారి కూడలిలో మొక్కలు నాటుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



శ్రీకాకుళం అర్బన్: అర్బన్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ సిబ్బంది



జి.సిగడాం: సంతవురిటి సచివాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



రణస్థలం: మొక్కలు నాటుతున్న రెడ్డీస్ ఫౌండేషన్ అధికారులు